సాక్షి
సిద్దిపేట
బుధవారం । 31 । జనవరి । 2024



స్వచ్ఛతలో సిద్దన్నపేట భేష్
ఇంటింటా చెత్త సేకరిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచటంతో సిద్దన్నపేట స్వచ్ఛ సిద్దన్నపేటగా నిలిచింది.
వివరాలు 8లో ▸



ఆపరేషన్ కోసం వచ్చి..
ఇందుర్తి మండలం చిగురుమామిడికి చెందిన వేముల రాజేశ్వరి కిడ్నీస్టోన్ శస్త్రచికిత్స కోసం వచ్చి విగతజీవిగా మారింది.
వివరాలు 8లో ▸



పుస్తకాల పంపిణీ
ఎమ్మెల్యే హరీశ్‌రావు సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ కంటెంట్ పుస్తకాలను పంపిణీ చేశారు.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

గాంధీజీ ఆశయాలే ఆదర్శం
మున్సిపల్ చైర్ పర్సన్ రజిత


గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రజిత

హుస్నాబాద్: దేశ స్వాతంత్య్రం కోసం, జాతి నిర్మాణం కోసం మహాత్మాగాంధీ సేవలు, త్యాగాలు అందరికి ఆదర్శనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కొనియాడారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం గాంధీ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ అహింసావాదంతో ఎంతటి కఠిన లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని నిరూపించిన గొప్ప నాయకుడని చెప్పారు. గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అనిత, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు బోజు రమా, స్వర్ణలత, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కోఆప్షన్ సభ్యులు శంకర్ రెడ్డి, అయూబ్ ఏఈ సాయి ప్రణీత్, ఆర్ఐ కృష్ణ తదితరులు ఉన్నారు.

జాతీయ అవార్డుకు ముత్తన్నపేట యువకుడు ఎంపిక


బొర్ర సురేష్ (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ముత్తన్నపేటకు చెందిన యువకుడు, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేశ్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేసినట్లు బహుజన సాహిత్య అకాడమి (బీఎస్ఏ) జాతీయ కమిటీ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏటా సాహిత్య ప్రియులకు ఇచ్చే ఈ అవార్డుకు సురేశ్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. తిరుపతిలో ఫిబ్రవరి 11న నిర్వహించే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్సులో ఈ అవార్డును అందిస్తామన్నారు.

మల్లన్న ఆలయ ఆదాయం రూ.59.71 లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రసిద్ధి గాంచిన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో లష్కర్ వారం (రెండో ఆదివారానికి) మూడు రోజుల బుకింగ్ ఆదాయం రూ.59.71 లక్షలు వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామివారికి భక్తులు వివిధ రకాల మొక్కుబడులు, దర్శనాలు, ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వారా భారీగా ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. గతేడాది లష్కర్ వారానికి రూ.38.78 లక్షలు సమకూరగా ఈ ఏడాది రూ 20.93 లక్షలు అధికంగా ఆదాయం వచ్చినట్లు ఆలయ బుకింగ్ ఇన్‌చార్జి మాధవి తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌ను ఫిబ్రవరి 1న మండల స్థాయిలో, 3న జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు ఫోరం సభ్యులు పూర్ణచందర్, వేణుమాధవ్, లక్ష్మారెడ్డి, నాగరాజు, బాలరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, కేజీబీవీ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొంటారన్నారు. మండల కేంద్రాల్లో మండల స్థాయి, సిద్దిపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఉద్యోగ అవకాశాలు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ రితేష్ ఠాకూర్

సిద్దిపేట ఎడ్యుకేషన్: సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్‌తో మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయని ఇండూరు కళాశాల ప్రొఫెసర్ రితేష్ ఠాకూర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కంప్యూటర్ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రితేష్ ఠాకూర్ మాట్లాడుతూ, సైబర్ క్రైమ్‌ను నియంత్రించడానికి, నేరగాళ్ల అటాక్‌ల నుంచి రక్షించుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ విభాగ అధిపతి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పరీక్షల విభాగాధిపతి డాక్టర్ గోపాల సుదర్శనం, కళాశాల ప్రధాన ఆచార్యుడు ప్రొఫెసర్ సీహెచ్ ప్రసాద్, డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల సర్దుబాటు!


గ్రామ పంచాయతీ భవనం

పంచాయతీల్లో ప్రత్యేక పాలనకు సన్నాహాలు
- రేపటితో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం
- ప్రత్యేక అధికారులుగా డివిజనల్ ఇంజనీర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు..

సాక్షి, సిద్దిపేట: పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనకు సర్వం సిద్ధమైంది. ఫిబ్రవరి ఒకటో తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణ సాధ్యపడని కారణంగా ప్రత్యేక అధికారులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక అధికారుల జాబితాను సిద్ధం చేసింది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ప్రత్యేక అధికారుల జాబితాను ప్రకటించనున్నారు.

26 మండలాలు 499 గ్రామ పంచాయతీలు
జిల్లా వ్యాప్తంగా 26 మండలాలు, 499 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పాలకవర్గాల పదవీకాలం ముగియనుండటంతో ప్రత్యేక అధికారులను నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు. డివిజనల్ ఇంజనీర్ స్థాయి అధికారి నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు జాబితాను సిద్ధం చేశారు. మేజర్ గ్రామ పంచాయతీలకు గెజిటెడ్ అధికారులను, తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు జూనియర్ అసిస్టెంట్లను నియమించనున్నారు. మండల పరిషత్, రెవెన్యూ, వ్యవసాయ, విద్య. నీటిపారుదల, మత్స్యశాఖ, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ, ఆర్ అండ్‌బీ, ఉద్యానవన శాఖలతో పాటు మరికొన్ని శాఖల నుంచి సిబ్బందిని ఎంపిక చేశారు.

పలు మండలాల్లో సర్దుబాటు ఇబ్బందులు
జిల్లాలో నూతనంగా ఏర్పాటైన మండల పరిషత్‌లు లేకపోవడంతో అధికారులను సర్దుబాటు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పెద్ద మండలాలైన చిన్నకోడూరు, కోహెడ, దుబ్బాకలలో అధికారులను నియమించేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుంది. నూతనంగా ఏర్పాటైన మండలాలు అక్కన్నపేటలో 32 గ్రామాలు ఉండటంతో అక్కడ అధికారుల కొరత ఏర్పడింది. అధికారులకు ఆర్డర్లు ఇచ్చిన తర్వాత మెడికల్, మెటర్నటీ సెలవులో ఎంత మంది ఉన్నారో తేలనుంది.

బిల్లులు వస్తాయా లేదా..?
గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు వస్తాయా లేదా అని సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. నిధులు రాకపోవడంతో పెండింగ్‌లో బిల్లులు పేరుకుపోయాయి. ఒక్కో సర్పంచ్‌కు సుమారుగా రూ.5లక్షలకు పైగానే బిల్లులు రావాలని సమాచారం. బిల్లుల నేపథ్యంలో తమనే మరో ఆరు నెలల పాటు కొనసాగించాలని కలెక్టర్‌కు పలు మండలాల సర్పంచ్‌లు వినతి పత్రాలు సైతం అందించారు.

జాబితాను సిద్ధం చేశాం
సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండటంతో ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేక అధికారుల పాలన కోసం సర్వం సిద్ధం చేశాం. జాబితాను కూడా రూపొందించాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం.
–దేవకి దేవి, డీపీఓ

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


మాట్లాడుతున్న డీఐఈవో సూర్యప్రకాశ్

సిద్దిపేటఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అదే నెల 15వ తేదీ వరకు మూడు దఫాలుగా జరగనున్న పరీక్షలకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సిద్దిపేట జిల్లాలో సైన్స్ గ్రూపులకు సంబంధించి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,242 మంది, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరంలో 8,476 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 7,411 మంది పరీక్షలు రాయనున్నారు. జనరల్, ఒకేషనల్ గ్రూపులు రెండింటికీ కలిపి 63 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం వారికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. అరగంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. హాల్ టికెట్లను ఆయా కళాశాలలో తీసుకోవాల్సి ఉంటుంది.

ఫిబ్రవరి 16, 19న ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, పర్యావరణ విద్య పరీక్ష
మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 16న ఇంగ్లిష్ సబ్జెక్టుకు సంబంధించి కొత్తగా ప్రవేశపెట్టిన ప్రాక్టికల్ పరీక్షను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుంది. గత సంవత్సరం ప్రథమ సంవత్సరంలో నైతికత –మానవ విలువలు (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్) పరీక్ష ఫెయిల్ అయిన విద్యార్థులకు 17న పరీక్ష నిర్వహిస్తారు. 19న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్విరాన్మెంట్ (పర్యావరణ విద్య) పరీక్ష నిర్వహిస్తారు.

పకడ్బందీగా పరీక్షలు
పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా గల హై పవర్ కమిటీని ఇంటర్మీడియట్ బోర్డు నియమించింది. పోలీస్ కమిషనర్, ఆర్‌జేడీ, డీఐఈఓ సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు అదనంగా డీఈసీ మెంబర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉంటాయి. ఇంకా డిపార్టుమెంటల్ అధికారులు సైతం పరీక్షల నిర్వహణలో పాలు పంచుకోనున్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి
ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణ సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన అన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాలకు నియమితులైన చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు నియమితులైన డిపార్టుమెంట్ అధికారులు ఒక రోజు ముందుగానే చేరుకొని మరోసారి ఏర్పాట్లను సరి చూసుకోవాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేవిధంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ చొరవ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈసీ మెంబర్లు, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.


కార్మికులతో కలసి నేలపై కూర్చున్న మంత్రి పొన్నం

గాంధీ స్ఫూర్తితో స్వచ్ఛ అడుగులు

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: మహాత్మా గాంధీ స్ఫూర్తితో స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ దుకాణ సముదాయ ఆవరణలో మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్మికుల సేవలను గుర్తించి వారిని సన్మానించారు. పొన్నం మాట్లాడుతూ హుస్నాబాద్‌లో స్వచ్ఛ కార్యక్రమాలపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. హుస్నాబాద్‌కు స్వచ్ఛతలో అనేక అవార్డులు రావడానికి ముఖ్య కారణమైన కార్మికులను గౌరవించాలన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించాలి
హుస్నాబాద్‌రూరల్: పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రాత్రి పందిల్లలో పల్లె దవాఖానను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలను అందించేందుకు తగు చర్యలు తీసుకుంటామని, వైద్య పరికరాల కొరత ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. అనంతరం రాములపల్లి, వంగరామయ్యపల్లి నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీపీ మానస, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, డీఎల్పీఓ భద్రయ్య, డాక్టర్ నిఖిత, సర్పంచ్‌లు తోడేటి రమేశ్, గంగం మధు, వంగ విజయలక్ష్మి పాల్గొన్నారు.

10 టన్నుల యూరియా నిల్వ ఉండాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్


మాట్లాడుతున్న శివప్రసాద్

హుస్నాబాద్‌రూరల్: రైతులకు యూరియా అందుబాటులో ఉండే విధంగా ఎరువుల దుకాణం డీలర్లు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ రైతు వేదికలో హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ప్రతి దుకాణంలో 10 టన్నుల యూరియాను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. రైతులకు ఎరువులను ఈపోస్ మిషన్ ద్వారానే ఆధార కార్డు అధారంగ ఎరువులు విక్రయించాలని సూచించారు. క్రయ విక్రయాల రిజిస్టర్‌ను దుకాణంలో అందుబాటులో ఉండాలని చెప్పారు. నకిలీ ఎరువులు విక్రయించ కుండా నాణ్యమైన ఎరువులనే రైతులకు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఏడీఏ మహేశ్, ఏఓలు నాగరాజు, బోగేశ్, సంతోష్, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.


పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న అధికారి నాగరాజు

ఫిబ్రవరిలోనూ కొనుగోళ్లు

సాక్షి ఎఫెక్ట్

గజ్వేల్: జిల్లాలో ఈనెల 31 నుంచి సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోళ్లను నిలిపివేయనుందని 'సాక్షి' లో 28న 'సీసీఐ కొనుగోళ్లకు మంగళం'శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి నాగరాజు ఈ అంశాన్ని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వరంగల్ సీసీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్‌తో మాట్లాడారు. ఫిబ్రవరిలోనూ పత్తి కొనుగోళ్లను కొనసాగించేలా ఒప్పించారు. ఈ విషయాన్ని మంగళవారం జిల్లా మార్కెటింగ్ అధికారి నాగ రాజు 'సాక్షి'కి తెలిపారు. కొనుగోళ్ల సందర్భంగా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.

క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి


బహుమతులతో క్రీడాకారులు

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోని మైదానంలో మంగళవారం ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ ఖోఖో టోర్నమెంట్‌తో పాటు సెలక్షన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలను ఎమ్మెల్సీ యాదవరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ టోర్నమెంట్‌లు ఉపయోగపడుతాయన్నారు. ఖోఖో పోటీలు గజ్వేల్ ప్రాంతంలో జరగడం అభినందనీయమన్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లా స్థాయిలో జరుగుతున్న ఖోఖో టోర్నమెంట్‌లో నిర్వాహకులు మంచినీటి సదుపాయం కల్పించకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి మొత్తం 16 జట్లు పాల్గొనగా, మొదటి స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ తీగుల్, ద్వితీయ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ కృష్ణాపూర్, తృతీయ స్థానాల్లో ప్రజ్ఞాపూర్‌లోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకులం, సెయింట్ మేరీస్ హైస్కూల్ క్రీడా జట్లు నిలిచాయి. అనంతరం వారికి మెమొంటోలను అందజేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నల్గొండ జిల్లాలోని భువనగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా వైస్‌ప్రెసిడెంట్ రవికుమార్, గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్లు మెట్టయ్య, శ్యామల, జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రుక్మిణి, పీడీ ఎలియాస్‌రావు, పీఈటీలు విజయరేఖ, దేవరాజు, మమత, జ్యోతి, అశ్విని, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోలీస్ కన్వెన్షన్ అద్భుతం

కమిషనర్ అనురాధ


మాట్లాడుతున్న సీపీ అనురాధ

చిన్నకోడూరు, సిద్దిపేటకమాన్ (సిద్దిపేట): సిద్దిపేటలో పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌ను అద్భుతంగా నిర్మించారని పోలీస్ కమిషనర్ డా.బి.అనురాధ ప్రశంసించారు. పట్టణ శివారులోని పొన్నాల వద్ద నిర్మించిన కన్వెన్షన్‌ను హాల్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. పోలీస్ వెల్ఫేర్‌లో భాగంగా పోలీస్ కన్వెన్షన్ నుంచి వచ్చే ఆదాయంలో ఇప్పటి వరకు 64 మందికి మొత్తం రూ.32,30,000 వెల్ఫేర్ లోన్ ఇచ్చారన్నారు.

సీఏఆర్ హెడ్‌క్వార్టర్ సందర్శన
మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులో ఉన్న సీఏఆర్ హెడ్‌క్వార్టర్‌ను కమిషనర్ అనురాధ సందర్శించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. క్వార్టర్‌లో ఉన్న ప్రతి సెక్షన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే అధికారులకు, సిబ్బందికి రివార్డులు, అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీలు రాంచదర్‌రావు, సుభాస్ చంద్రబోస్, రిజర్వు సీఐలు పూర్ణచందర్, రాజేశ్, ధరణికుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాటిల్స్‌లో పెట్రోల్ అమ్మకూడదు
సిద్దిపేటకమాన్: పెట్రోల్ పంపు యజమానులు, కార్మికులు బాటిల్స్‌లో పెట్రోల్, డీజిల్ అమ్మకూడదని సీపీ అనురాధ ఆదేశించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పెట్రోల్ పంపు యజమానులతో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెట్రోల్ పంపులు నడుస్తున్న తీరు, పెట్రోల్ పంపుల్లో భద్రత చర్యల గురించి అసోసియేషన్ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాహనదారులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రతీ పెట్రోల్ పంపులో సూచనల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోల్ పంపు పరిసరాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

పంటల పరిశీలన


వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేటరూరల్: యాసంగిలో పుల్లూరు రైతులు సాగుచేస్తున్న మిర్చి, వరి పంటలను మంగళవారం తోర్నాల పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. రైతు కర్నాల నారాయణ సాగు చేస్తున్న వరి పంటను సందర్శించి మొగి పురుగు ఉధృతిని గమనించిన శాస్త్రవేత్త పల్లవి, మండల వ్యవసాయాధికారి పర్శరాంరెడ్డి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ స్పందన, సర్పంచ్ నరేశ్, రైతులు పాల్గొన్నారు.

గృహప్రవేశాలు ఎప్పుడు..?

- రోడ్డెక్కిన డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు
- గజ్వేల్‌లో రాస్తారోకో.. స్తంభించిన ట్రాఫిక్


గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఆర్డీవో బన్సీలాల్, ఏసీపీ రమేష్

గజ్వేల్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం లబ్ధిదారులు రోడ్డెక్కారు. లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన తమకు గృహప్రవేశాలు ఎప్పుడు చేయిస్తారంటూ గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. ఫలితంగా గజ్వేల్–తూప్రాన్ రహదారి స్తంభించింది. శాసనసభ ఎన్నికలకు ముందు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కోసం లాటరీ పద్ధతిలో 1100 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరికి ఇళ్ల నంబర్లను సైతం కేటాయించారు. పట్టణంలోని పాలిటెక్నిక్ వెనుకభాగంలో గల డబుల్ బెడ్‌రూమ్ మోడల్‌కాలనీలో గృహ ప్రవేశాలు చేయించాల్సి ఉంది. కానీ ఆ ఇళ్లల్లో ప్రస్తుతం మల్లన్నసాగర్ నిర్వాసితులు తాత్కాలికంగా నివాసం ఉండటంతో గృహప్రవేశాల అంశం పెండింగ్‌లో పడుతూ వస్తోంది. దీంతో లబ్ధిదారులు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నుంచి ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకొని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. గజ్వేల్ ఏసీపీ రమేశ్ ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆర్డీవో వచ్చి ఇళ్ల పంపిణీపై స్పష్టత ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించారు. ఈ క్రమంలో ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ బాల్‌రాజులను ఇక్కడకు పిలిపించి ఆందోళనకారులతో మాట్లాడించారు. అయితే.. ఆర్డీవో సమాధానంతో వారు సంతృప్తి చెందలేదు. దీంతో ఆర్డీవో, తహశీల్దార్ అక్కడి నుంచి వెళ్లిపోవడంతో లబ్ధిదారులు రాస్తారోకోను కొనసాగించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన ఈ ఆందోళన మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగింది. చివరకు ఏసీపీ రమేశ్ మరోసారి ఆందోళనకారులను సముదాయించారు. 10మంది ప్రతినిధులుగా తన కార్యాలయానికి వస్తే.. తాను చొరవ తీసుకొని అధికారులతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు శాంతించారు.

క్లుప్తంగా

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులు అడ్డుకున్న మట్టి టిప్పర్‌లు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని రాళ్లకత్వ గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తుండడంతో మంగళవారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానికంగా ఉన్న కంకర క్రషర్‌ల నుంచి అక్రమంగా రాత్రి సమయంలో మట్టిని అక్రమార్కులు తరలిస్తున్నారని ఆరోపించారు. గ్రామస్తులు ఈ విషయాన్ని రెవెన్యూ, పోలీసులకు తెలియజేశారు.

ప్రిన్సిపాల్‌పై చర్యకు డిమాండ్

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో మత ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని హిందు సంఘాల నాయకులు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. మంగళవారం భజరంగ్‌దళ్ కన్వీనర్ సుబాస్‌చందర్ ఆధ్వర్యంలో ఎంఈఓ అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సిబా మాడల్ కళాశాలలో క్రైస్తవ మత బోధనలు చేయిస్తుందని ఆరోపించారు.

క్రషర్లపై టాస్క్‌ఫోర్స్ సర్వే

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని లక్డారం గ్రామంలో క్రషర్లపై టాస్క్ ఫోర్స్ అధికారులు సర్వే చేపట్టారు. నిర్వాహకులు ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆర్డీఓ నేతృత్వంలో ఇటీవల ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం ఆ టీమ్ క్రషర్లపై క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. ఏ మేర అనుమతులున్నాయి, నిబంధనలు అతిక్రమించారా అనే విషయాలపై ఆరా తీశారు.

ప్రశ్నిస్తే అసహనం ఎందుకు?

- దాడులు చేస్తే ఊరుకోం
- చైర్మన్‌కు క్షమాపణ చెప్పాలి
- జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు, నాయకులకు అసహనం ఎందుకని జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ప్రజల మనోభావాలను కించపరిచేలా మంత్రుల వ్యవహార శైలి ఉందన్నారు. భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి మీద జరిగిన దాడిని ఖండించారు. ఆయనకు మంత్రి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షించాల్సిన పోలీసులు క్యాబినెట్ హోదా ఉన్న జెడ్పీ చైర్మన్‌ను నెట్టివేయడం సరి కాదన్నారు. సంబంధించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కలిసి వినతి పత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు. దాడులకు పాల్పడితే ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఎప్పుడూ ఇలాంటి చర్యలు లేవన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు శర్మ, నాయకులు ఎల్లారెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న పీడీ

దుబ్బాకరూరల్: ఉపాధి హామీ పనులపై మండల ఎంపీపీ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు పీడీ కౌసల్యాదేవి హాజరై 2022–23 సంవత్సరంలో జరిగిన పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఎవరైన అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలతో పాటుగా స్వాహా చేసిన నిధులను రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలత, ఏపీడీ బాల్‌రాజ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతలో సిద్దన్నపేట భేష్



పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్



తాగునీటి ట్యాంక్ వద్ద నిర్మించిన ఇంకుడు గుంత

- ఇంటింటికీ ఇంకుడు గుంతలు
- ప్లాస్టిక్ నిషేధం.. మురుగు రహితం
- జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు సొంతం
- జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణకు ఎంపిక

నంగునూరు(సిద్దిపేట): ఇంటింటా చెత్త సేకరిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచమే కాకుండా మౌలికవసతుల కల్పన, మహిళలకు అవగాహన కల్పించడంతో మండలంలోని సిద్దన్నపేట స్వచ్ఛ సిద్దన్నపేటగా నిలిచింది. చెత్త సేకరణ, మరుగు దొడ్లు, నల్లా కనెక్షన్లు, ఇంకుడు గుంతలు నిర్మించడంతో పరిశుభ్రంగా మారింది ఈ గ్రామం. దీంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవార్డులు సొంతం చేసుకుంది. అంతేకాదు కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేసే స్వచ్ఛ సర్వేక్షణ అవార్డుకు కూడా నామినెట్ అవడం పరిశుభ్రతకు అద్దంపడుతోంది.

శుభ్రతకు చర్యలెన్నో..

నంగునూరు మండలం సిద్దన్నపేటలో ప్రభుత్వం డంపింగ్ యార్డు నిర్మించడంతో పంచాయతీ సిబ్బంది ఇంటింటా తిరిగి సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి సేంద్రియ ఎరువుగా తయారుచేస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, రెండు ఇంకుడు గుంతలు నిర్మించారు. సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు తాగునీటి ట్యాంక్‌లు, మురుగుకాల్వల చివరలో ఇంకుడు గుంతను ఏర్పాటుచేసి మురుగుకు చెక్ పెట్టారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించి స్టీల్‌బ్యాంక్‌లు ఏర్పాటు చేశారు. మహిళలు రసాయన రహిత మెనుస్ట్రువల్ కప్పులను వినియోగించేలా అవగాహన కల్పించి వాటిని ఉచితంగా పంపిణీ చేశారు.

ఉట్టి పడుతున్న పచ్చదనం

హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ ద్వారా అధిక సంఖ్యలో మొక్కలు నాటి పచ్చదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. మౌలిక వసతుల కల్పనలో బాగంగా తాగునీటి ట్యాంక్‌లు, మరుగుదొడ్లు, వైకుంఠదామం, ఓపెన్‌జిమ్, సామాజిక భవనాలు నిర్మించారు.

అవార్డులు సొంతం..



గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు చేస్తున్న కృషి ఫలితంగా జిల్లా, రాష్ట్ర స్థాయి బహుమతి గెలుచుకున్నాం. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారం, సూచనలతో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాం. దీంతో గ్రామం స్వచ్ఛ సర్వేక్షణ అవార్డుకు నామినేట్‌ైంది.

– దాకూరి కనకవ్వ, సర్పంచ్, సిద్దన్నపేట

ఆదర్శంగా నిలవడం హర్షణీయం



అధికారుల సూచనలు, గ్రామ పాలక మండలి, పంచాయతీ సిబ్బంది కృషితో గ్రామం స్వచ్ఛ సిద్దన్నపేటగా మారి అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించడంతో పాటు మురుగు రహితంగా తీర్చిదిద్దడంతో ప్రజలను వ్యాధుల బారిన పడకుండా కాపాడుతున్నాం.

– బెదురు తిరుపతి, ఎంపీటీసీ, సిద్దన్నపేట

గ్రామస్తుల సహకారంతో గుర్తింపు



గ్రామం క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు ప్రజల సహకారం ఎంతో అభినందనీయం. సర్పంచ్, ఎంపీటీసీ, ఉన్నతాధికారుల సహకారంతో గ్రామాన్ని సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దాం. జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉంది.

– రవీందర్, పంచాయతీ కార్యదర్శి

హోటల్‌లో అగ్ని ప్రమాదం

- గ్యాస్ సిలిండర్ లీక్.. తప్పిన ప్రాణ నష్టం
- రూ.2లక్షల విలువైన సామగ్రి దగ్ధం



ప్రమాదం అనంతరం చిందరవందరగా హోటల్ కిచెన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ఆనంద్ దర్శని హోటల్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సిద్దిపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న ఆ హోటల్‌లో మంగళవారం ఉదయం కిచెన్‌లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో కిచెన్‌లోని వంట మనుషులు వెనుక ద్వారం నుంచి బయటకు పరుగులు తీయగా కస్టమర్‌లు భయంతో రోడ్డు మీదకు వచ్చారు. అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్‌లు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కిచెన్ రూంలోని ఎలక్ట్రిక్, వంట సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఎంటువంటి ప్రాణ నష్టం జరగలేదు. రూ.2లక్షల నష్టం వాటిల్లిందని నిర్వాహకులు తెలిపారు. హోటల్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వినియోగదారులు, స్థానికులు వాపోయారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్
- పంటలు పరిశీలించిన శాస్త్రవేత్తలు, అధికారులు



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

సిద్దిపేటరూరల్: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ సూచించారు. మంగళవారం నారాయణరావుపేట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు పొలాలను పరిశీలించారు. కాండం తొలిచే పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ మాట్లాడుతూ వరి పిలకలువేసే దశలో ఉందని ఈ సమయంలో రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి పొందే అవకాశం ఉందన్నారు. కాండం తొలిచే పురుగును గమనించడానికి దీపపు ఎర, సోలార్ దీపపు ఎర, లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగుపై నిఘా పెట్టాలని సూచించారు. పిలక దశలో ఎకరాకు మూడు లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని, వారానికి బుట్టలో 25 నుంచి 30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చేపట్టాలని చెప్పారు. నారు నాటే వారం రోజుల ముందు ఎకరాకు సరిపడే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యురాన్ 3జి గుళికలు లేదా 600 గ్రాముల ఫిప్రోనిల్ 3జి గుళికలు వేయాలన్నారు. ఒకవేళ నారుమడిలో వేయకపోతే 15 రోజుల వయసున్న వరి పైరులో యాసంగిలో తప్పకుండా ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు, లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు, లేదా క్లోరంట్రానీలిప్రోల్ 0.4జి గుళికలు నాలుగు కిలోలు వేయాలని సూచించారు. లార్వాదశ మొగిపురుగు నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ లీటర్‌ల నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే జింక్ లోపం నివారణకు లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో తోర్నాల పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి, ఏరువాక శాస్త్రవేత్త విజయ్ కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు పద్మ, మండల వ్యవసాయ అధికారి రమణి, సర్పంచ్ , ఏఈఓ నాగార్జున, రైతులు నగేశ్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కిష్టయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక



ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికైన క్రీడాకారులు

మిరుదొడ్డి(దుబ్బాక): అండర్–19 బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి మెదక్ జిల్లా బాల బాలికల జట్లను ఎంపిక చేశామని మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, జిల్లా జనరల్ సెక్రెటరీ పీవీ. రమణ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. బాలుర జట్టులో మిరుదొడ్డికి చెందిన వేముల సిద్ధార్థ, మద్దెల అనిల్, ఎం.ప్రణయ్, ఆర్‌సీ పురానికి చెందిన కె.అనికేత్, జి.తన్విష్, శశాంక్, సోమేశ్, అశోక్ నగర్‌కు చెందిన ఎస్.భరత్‌రాజ్, ఎస్.మోహిన్, ఓల్డ్ ఎంఐజీకి చెందిన ఎస్.కృష్ణసాయి, ఎం.చైతన్య, అంబేద్కర్ నగర్‌కు చెందిన కె.నవీన్ ఎంపికయ్యారని తెలిపారు. బాలికల జట్టులో ఎమ్ఐజీకి చెందిన ఇ.తానియా, ఎల్.అఖిల, సఫియా నిఖత్, రామచంద్రాపురానికి చెందిన కె.భవాని, ఓల్డ్ ఎంఐజీకి చెందిన పి.శ్రీలక్ష్మి, ఎల్.అఖిల, యస్.శ్రావణి, బీహెచ్ఈఎల్‌కు చెందిన బి.రాధిక ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 9 నుంచి, 11 వరకు జరిగే 68వ రాష్ట్ర స్థాయి అండర్–19 జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

'టెలిగ్రామ్'లో పెట్టుబడి పేరుతో సైబర్ మోసం


- రూ.6.11లక్షలు మాయం

సిద్దిపేటకమాన్: టెలిగ్రామ్ యాప్‌లో పెట్టుబడి పేరుతో వచ్చిన లింకును ఓపెన్‌చేసి ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించి బాధితుడు సైబర్ మోసానికి గురైన ఘటన పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోటుచేసుకుంది. సీపీ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి టెలిగ్రామ్ యాప్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని గుర్తుతెలియని వ్యక్తి లింకును పంపించాడు. బాధితుడు ఆ లింకును ఓపెన్‌చేసి పలు విడతలుగా ఆన్‌లైన్‌లో రూ.6,11,108 జమచేశాడు. తర్వాత ఆ లింకును ఓపెన్ చేయగా బ్లాక్‌చేసి ఉండడంతో మోసపోయినట్టు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

కుక్కకాటుకు వ్యాక్సిన్ వేయించాలి

పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: కుక్క కరిస్తే తప్పనిసరిగా



రేబిస్‌పై అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి

వ్యాక్సిన్ వేయించాలని, నిర్లక్ష్యం చేయడం అత్యంత ప్రమాదకరమని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోగల కేజీబీవీలో మంగళవారం జిల్లా పశు వైద్య – పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రేబిస్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కుక్క కరిచినచోట ప్రథమ చికిత్సగా సబ్బుతో శుభ్రంగా కడగాలని, తదనంతరం వైద్యులను సంప్రదించి నాలుగు సార్లు రేబిస్ వ్యాక్సినేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కేజీబీవీ ప్రత్యేకాధికారి అనురాధ, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, శ్యామల, వైద్యులు గజ్వేల్ డివిజనల్ ఏడీ డాక్టర్ రమేష్, డాక్టర్ శ్వేత, డాక్టర్ రమేష్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్న హస్తం

దుబ్బాక: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డుకు చెందిన కొండా బాలకృష్ణ కుటుంబానికి దుబ్బాక అయ్యప్ప సేవా సమితి సభ్యులు అండగా నిలిచారు. బాలకృష్ణకు కొడుకు, కుమార్తె భవాని ఉన్నారు. ఆమె పేరుపై దుబ్బాక పోస్టు ఆఫీస్‌లో రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మంగళవారం ఆ బాండ్‌ను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సుభాష్, సత్యం, రాజు, దేవేందర్ , అరుణ్, తదితరులున్నారు.

దళితబంధు ఇప్పిస్తానంటూ వసూళ్లు

తిరిగి ఇవ్వాలంటూ బాధితుల ధర్నా



నిరసన తెలుపుతున్న బాధితులు

మద్దూరు(హుస్నాబాద్): దళితబంధు ఇప్పిస్తామని తమ నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వాలని సర్పంచ్ ఇంటి ఎదుట బాధితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూళిమిట్ట మండల పరిధిలోని తోర్నాల సర్పంచ్ కుమారుడు భిక్షపతి దళితబంధు ఇప్పిస్తానని గ్రామంలోని ఆరుగురు దళితుల నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేశారన్నారు. బాధితులు మేక యాదగిరి, పంగ ఎల్లయ్య, పేరం రవి, మేక శేఖర్, పేరం పరశురాములు, ఎర్ర మల్లేశం మంగళవారం ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ సర్పంచ్ తాళ్లపల్లి రాజమ్మ కుమారుడు భిక్షపతి తమకు దళిత బంధు మంజూరు చేయిస్తానని, రెండేళ్ల క్రితం ఒక్కొక్కరి నుంచి రూ.1 చొప్పున తీసుకున్నాడని వాపోయారు. నేటికీ తమకు దళితబంధు డబ్బులు రావడం లేదన్నారు. బాధితులకు మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు సుందరగిరి భాస్కర్ మాట్లాడుతూ భిక్షపతి తీసుకున్న డబ్బులు తిరిగి బాధితులకు ఇవ్వాలని, లేనిపక్షంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. భిక్షపతిని వివరణకోరగా దళితబంధు పథకం మంజూరు కోసం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి ఆదేశాల మేరకే ఆరుగురి దగ్గర వసూల్ చేశానని చెప్పాడు. డబ్బులు తిరిగి బాధితులకు ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు.

ఆపరేషన్ కోసం వచ్చి విగతజీవిగా..

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే అంటూ ఆరోపణ



రాజేశ్వరి మృతదేహంతో బంధువుల ఆందోళన

సిద్దిపేటజోన్: కిడ్నీస్టోన్ శస్త్రచికిత్స కోసం వచ్చి ఓ మహిళ విగతజీవిగా మారింది. ఈ ఘటన సిద్దిపేటలో మంగళవారం ఆందోళనకు దారితీసింది. బాధితుల కథనం ప్రకారం.. ఇందుర్తి మండలం చిగురుమామిడికి చెందిన వేముల రాజేశ్వరి సోమవారం ఓ స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. ఆమెను పరిశీలించిన వైద్యులు రాత్రి 11 తరువాత సర్జరీ చేశారు. సర్జరీ సమయంలో మహిళ పరిస్థితి విషమంగా మారడంతో వైద్యులు హుటాహుటిన సమీపంలో ఉన్న మరొక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మహిళ చనిపోయినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీనితో మృతురాలి బంధువులు మంగళవారం తెల్లవారుజామున రాజేశ్వరి మృతదేహంతో శస్త్ర చికిత్స జరిగిన ఆసుపత్రిలో ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మహిళ చనిపోయిందని ఆరోపించారు. సర్జరీ సమయంలో రాజేశ్వరికి కార్డియక్ అరెస్టయి చనిపోయిందని, తమ నిర్లక్ష్యం ఏమీ లేదని వైద్యులు బదులిచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువులకు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

ఎన్నెన్నో వర్ణాలు...





లోకానికి వెలుగులు పంచేందుకు బయల్దేరిన భానుడు వస్తూ వస్తూ కొత్త అందాలను ఆవిష్కరించాడు. సన్నని మంచు పొరలను కరిగిస్తూ.. నీరెండను ప్రసరిస్తూ కనువిందు చేశాడు. ఆ వెలుగుల రేడు ప్రభావానికి పరిసరాలు స్వర్ణారుణ వర్ణాలు అద్దుకుని అందంగా మెరిశాయి. ఈ దృశ్యాలను సిద్దిపేటశివారుల్లోని కృష్ణసాగర్ సమీపంలో సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

తాళం వేసిన ఉన్న ఇళ్లలో చోరీలు

- మూడు చోట్ల దొంగతనాలు
- నగదు, బంగారు ఆభరణాలు మాయం



డాగ్ స్క్వాడ్‌తో వివరాలను సేకరిస్తున్న పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక): తాళం వేసిఉన్న మూడు ఇళ్లలో దొంగలు చెలరేగిపోయారు. నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించేపనిలో పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని అల్వాలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మ నవీన్, రొడ్డ నర్సవ్వ తమ ఇళ్లకు తాళంవేసి బంధువుల ఇళ్లకు వెళ్లారు. తాళంవేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు సోమవారం అర్ధరాత్రి ఆ మూడిండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులగొట్టి బీరువాలో రూ.10 వేల నగదు, వెండి పట్టగొలుసులు, అర తులం బంగారు కమ్మలను దొంగలు ఎత్తుకెళ్ళినట్లు బాధితులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరి ఇళ్లలోను చోరీకి యత్నించారు. అక్కడ ఏమీ దొరక్కపోవడంతో వస్తువులను చిందరవందరగా పడేశారు. మంగళవారం ఉదయం దొంగతనం విషయం తెలుసుకున్న బాధితులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలను సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు. ఇళ్లకు తాళంవేసి గ్రామాలకు వెళ్ళేవారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఆయన సూచించారు.

చేర్యాలలో..

తాళంవేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.60వేల విలువ గల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడవేర్గు రోడ్డులో నివాసం ఉంటున్న పోతురెడ్డి దేవేందర్‌రెడ్డి ఈ నెల 26న ఇంటికి తాళంవేసి కుటుంబ సమేతంగా తిరుపతి దైవ దర్శనానికి వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపు పగుల గొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హుస్నాబాద్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు, నగదు అపహరించిన ఘటన మంగళవారం హుస్నాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ముదిరాజ్ కాలనీకి చెందిన వెల్దండి రాజేంద్ర ప్రసాద్ పని నిమిత్తం బయటకు వెళ్లగా, ఆయన భార్య ఊరికి వెళ్లింది. తిరిగి సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగానే ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంటిలోని బీరువా తలుపులు పగలగొట్టి ఉండటం గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కిరణ్, ఎస్ఐ మహేష్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. ఊరికి వెళ్లిన భార్యకు సమాచారం అందించడంతో ఆమె రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకొంది. బీరువాలో ఉన్న ఎనిమిది తులాల బంగారం, రూ.60 వేల నగదు దొంగలు అపహరించినట్లు నిర్ధారించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి హామీ పరిరక్షణ సదస్సు జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

గజ్వేల్‌రూరల్: ఉపాధి హామీ పరిరక్షణ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని శేరుపల్లిలో మంగళవారం సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర విధానాలు ఉపాధి పనులపై కూలీలకు ఆసక్తి తగ్గేలా చేసేలా ఉన్నాయని, ఇందుకోసం ఫిబ్రవరి 2వ తేదీన డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పరిరక్షణ రాష్ట్ర సదస్సును నిర్వహించతలపెట్టినట్లు తెలిపారు. సదస్సుకు మంత్రి సీతక్క, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గోపాల్‌రావు, మానవ హక్కుల వేదిక జాతీయ సమన్వయకర్త జీవన్‌కుమార్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు.